క్లుప్తంగా

స్థలం కబ్జా చూపాలంటూ తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: మండలంలోని నేదునూరు పంచాయతీ పరిధిలోని అక్బర్‌జా రెవెన్యూ సర్వే నంబర్ 9లో గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల సర్టిఫికెట్లకు సంబంధించి స్థలాలను కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఆ సర్వే నంబర్‌లో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 163 మంది పేదలకు 60 గజాల చొప్పున సర్టిఫికెట్లు అందించి, ఇంతవరకు కబ్జా చూపలేదన్నారు. ఇచ్చిన సర్టిఫికెట్లకు కబ్జా చూపాలని పలుమార్లు అధికారులకు విన్నవించామని, మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె హామీ ఇచ్చిందన్నారు. అధికారులు స్పందించి కబ్జా చూపి పేదలకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.చందు, ఎ.కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

బీజేపీ మహేశ్వరం పాలక్ సుధాకర్‌రెడ్డి



నేతలను సన్మానిస్తున్న కపిల్‌గౌడ్

పహాడీషరీఫ్: బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం పాలక్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ఎం.కపిల్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరాంకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు దిశగా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలచారికి సత్కారం



వేణుగోపాలచారిని సత్కరిస్తున్న సరూర్‌నగర్ బ్రాహ్మణ సంఘం నాయకులు

హుడాకాంప్లెక్స్: కేంద్ర మాజీమంత్రి, టీఆర్ఎస్ నేత సముద్రాల వేణుగోపాలచారి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సరూర్‌నగర్‌కు చెందిన బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.ప్రసాద్, వి.శ్రీనివాసరావు, కల్పవల్లి, ఈశ్వర్, వాణి ఉన్నారు.

ఊపందుకున్న బూస్టర్ డోస్



బూస్టర్ డోస్ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మీర్‌పేట: బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ ఊపందుకుంది. మొదటి, రెండో డోస్ టీకా తీసుకున్న వారు ప్రతి రోజు సుమారు 80 మంది ఆసుపత్రికి వచ్చి బూస్టర్ టీకా తీసుకుంటున్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

హయత్‌నగర్: కొత్తకొత్త ఎత్తుగడలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాలపై విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సూర్య అన్నారు. గురువారం హయత్‌నగర్‌లోని అభ్యాస కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్నెట్ ద్వారా పలు మోసపూరితమైన యాప్‌లు పుట్టుకొస్తున్నాయని, ఆకర్షణీయంగా ఉండే ఇలాంటి యాప్‌ల జోలికి వెళ్లరాదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తు తెలియని వారితో ఓటీపీలను, కేవైసీలను షేర్ చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు.



రామాలయం పార్కు ఎదుట చెత్త

మురుగుతో పరేషాన్

- హుడాకాంప్లెక్స్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రోడ్లపై పారుతున్న మురుగు
- రోగాలబారిన పడుతున్న స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ, వరదనీటి కాలువ పనులకు సుమారు రూ.84 లక్షలు వ్యయం చేశారు. ఈ పనులతో ప్రయోజనం నెరవేరకపోగా.. కాలనీవాసుల అవస్థలు తీరలేదు. ప్రతిపాదనల ప్రకారం పనులు పూర్తికాలేదు. గుత్తేదారుకు మాత్రం చెల్లించారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడాకాంప్లెక్స్‌లోని సౌమ్య అపార్ట్‌మెంట్ సమీపంలోని భూగర్భ డ్రైనేజీ, వరద కాలువల పనితీరు ఇది. ప్రతి నెల సీవరేజ్ చార్జీలు చెల్లిస్తున్నా కాలనీవాసులకు మాత్రం మురుగు కష్టాలు తీరటంలేదు. మురుగునీరు బయటకు వెళ్లేందుకు అవుట్‌లెట్‌ను ఎటు మళ్లించాలో పరిశీలించకుండా భారీ మొత్తంలో నిధులు వెచ్చించడంతో ప్రజాధనం వృథా కావడమే కాక ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

12,500 మంది నివాసం..

కొత్తపేట చౌరస్తా సమీపంలో 1988లో అప్పటి ప్రభుత్వం సకల సౌకర్యాలతో 25 ఎకరాలలో హుడా లేఅవుట్ కాలనీ ఏర్పాటు చేసింది. ఈ కాలనీలో సుమారు 47 అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. ఆ ఫ్లాట్లలో సుమారు 12,500 మంది నివాసం ఉంటున్నారు. ప్రతినిత్యం రోడ్లపై మురుగు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, మంత్రి సబితా రెడ్డి పలుమార్లు సందర్శించి సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారే తప్ప పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు..

దిగువకు అవుట్‌లెట్ ద్వారా మురుగు వెళ్లలేకపోవడంతో మ్యాన్‌హోళ్ల వద్ద మురుగునీరు ఒత్తిడి పెరిగి పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం, దోమల తీవ్రత ఎక్కువ కావడంతో అద్దెదారులు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. నెలరోజుల క్రితం కాలనీలో పర్యటించిన మంత్రి సబితారెడ్డి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు.మురుగుతో వచ్చే వాసనకు రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



సౌమ్య అపార్ట్‌మెంట్ ఎదుట రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

“ సమస్య పరిష్కరించాలి



ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాక ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. రోడ్లపై మురుగు ప్రవహించినప్పుడు తూతూ మంత్రంగా వచ్చివెళ్లడమే తప్ప పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా మురుగు సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి. కార్పొరేటర్, మంత్రికి ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడంలేదు. వెంటనే సమస్య పరిష్కరించాలి.

– మన్యం, సరూర్‌నగర్

సమస్యలు పరిష్కరించండి

- న్యూమధురానగర్ కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: ‘మా కాలనీని అన్నివిధాల అభివృద్ధి చేయండి. డ్రైనేజీ, రోడ్లతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలి’ అంటూ అల్మాస్‌గూడ న్యూమధురానగర్ కాలనీవాసులు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇప్పటివరకు రోడ్లు, డ్రైనేజీలు వేయలేదని, మధురానగర్ కాలనీ నుంచి విడిపోయి, కొత్తగా సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే, కావాలనే న్యూమధురానగర్ పేరును మార్చి ఇంద్రహిల్స్ సంక్షేమసంఘం అని పేరు పెట్టారంటూ స్థానిక ప్రజాప్రతినిధులను విమర్శించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కాలనీలన్నీ సమానమే..

ఇంద్రహిల్స్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ వేయాలని మంత్రి సబితారెడ్డి సంతకం(ఎండర్స్) చేసి బడంగ్‌పేట కార్పొరేషన్‌కు పంపారని 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక చెప్పారు. వీధికో పేరు పెట్టుకుంటున్నారు. అది వాళ్లిష్టం. ఈ విషయంలో మంత్రి, కార్పొరేటర్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆమె తెలిపారు. అభివృద్ధి అనేది రాత్రికిరాత్రి జరిగేది కాదని, దశలవారీగా జరుగుతుందన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు సమానమేనని, కాలనీల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతామని పేర్కొన్నారు.

బలిజ సంఘం భవన నిర్మాణానికి కృషి

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- వీరశైవ లింగాయత్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబితారెడ్డి, నేతలు

మహేశ్వరం: వీరశైవ లింగాయత్ బలిజ సంఘం సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల వీరశైవలింగాయత్ బలిజ సంఘం అధ్యక్షుడు సతేంద్ర శివకుమార్ అధ్యక్షతన నగరంలోని మంత్రి సబితాఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సంఘం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న వీరశైవ లింగాయత్ బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారంటే కారణం సీఎం కేసీఆర్ చలవే అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో బస్వ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి, భవనం నిర్మాణం చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ బీసీ యువతకు సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలవీరశైవ లింగాయత్ బలిజ సంఘం ప్రధాన కార్యదర్శులు సదానందం, సీనియర్ నాయకులు శివకుమార్, సతేంద్ర శ్రీశైలం, శంకరప్ప, శివకుమార్, రాజలింగం, శేఖర్, పరమేష్, విక్రమ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

పహాడీషరీఫ్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట పెన్నిధిగా మారిందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. అనారోగ్యానికి గురైన మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జంగయ్య చికిత్స అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కార్పొరేటర్ సాయంతో దరఖాస్తు చేసుకున్నాడు. మంత్రి సబితారెడ్డి సాఫారసుతో మంజూరైన రూ.32,500 చెక్కును కార్పొరేటర్ గురువారం బాధితుడి కుమారుడు శ్రీకాంత్‌కు అందించాడు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బండారి గోపాల్ యాదవ్, యాతం బాలరాజు, సురేష్ గౌడ్, కిరణ్‌కుమార్ ముదిరాజ్, జగన్, శ్రీశైలం, కోట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి మహిళ అదృశ్యం



శిరీష (ఫైల్)

హయత్‌నగర్: భర్తతో గొడవపడి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... హయత్‌నగర్ డివిజన్ సూర్యానగర్‌లో నివసించే ఇసుకపల్లి మహేంద్రారెడ్డి ప్రైవేటు ఉద్యోగి. ఆయన భార్య శిరీష(25) బుధవారం రాత్రి గుర్తు తెలియని వారితో ఫోన్‌లో చాటింగ్ చేస్తుంది. ఈ విషయమై భర్త ప్రశ్నించడంతో వారి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శిరీష చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త మహేంద్రారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పిల్లల బాధ్యత ఉపాధ్యాయులదే

మంత్రి సబితారెడ్డి



ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మీర్‌పేట: చదువుతో పాటు జీవితంలో ఏ కష్టం వచ్చినా విద్యార్థులు నిలదొక్కుకునేలా ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి బోధనోపకరణ కృత్యాల ప్రదర్శన (టీఎల్ఎం)ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతుల్లో వెనుకబడ్డ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. పిల్లలకు కర్త, కర్మ, క్రియ అన్నీ పాఠశాలే కావున తొలిమెట్టు ద్వారా పిల్లలందరూ ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం పొందేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మన ఊరు-మన బడిలో భాగంగా పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు, తొలిమెట్టు కార్యక్రమంతో పిల్లల్లో నైపుణ్యంతో పాటు 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా పేరెంట్స్ మీటింగ్‌లు నిర్వహిస్తూ నూతన ఒరవడితో చదువు చెప్పాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అనంతరం టీఎంఎల్ మేళాలో బాలాపూర్, సరూర్‌నగర్, కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రదర్శించిన అంశాలను మంత్రి పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, ఎంఈఓ కృష్ణయ్య, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల మేయర్లు ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, చిగురింత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్‌లు గజ్జెల రాంచందర్, అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య, ఎనుగుల అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు నిర్మాణాలతో అవస్థలు

ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లపై అడ్డగోలుగా నిర్మిస్తున్న ర్యాంపులు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నిర్దిష్టమైన పద్ధతి లేకుండా రోడ్లపైకి ర్యాంపుల నిర్మాణం సాగుతుండటంతో చాలా చోట్ల రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ర్యాంపులు ఉండడంతో కుంచించుకుపోయి ఆ దారినవెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- రోడ్లపై అడ్డగోలుగా ర్యాంపులు, మెట్లు
- కుంచించుకుపోతున్న రహదారులు
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారగణం



హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో రోడ్డుపైకి మెట్లు, సుభద్రానగర్‌లో మెట్లు, రెయిలింగ్‌లు





వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో రోడ్డు మధ్య వరకు వచ్చిన ర్యాంపు, శ్రీకృష్ణానగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ర్యాంపులు, గ్రీనరీతో ఇరుకుగా మారిన రోడ్డు

వనస్థలిపురం: ర్యాంపులు, ఇతర నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, కాలనీ సంక్షేమ సంఘాలుగానీ పెద్దగా పట్టించుకోకపోవడంతో పలువురు ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు. బస్సులు తిరిగే రహదారులతో పాటు, కాలనీలలో రోడ్ల వెంబడి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మాణాలు జరుపుకొంటుండటంతో వాటికి సంబంధించిన ర్యాంపులు, మెట్లు, రెయిలింగ్‌లు రోడ్లపైకి వస్తున్నాయి.

- రోడ్డుకు సమాంతరంగా గృహాలు నిర్మిస్తే భవిష్యత్‌లో రోడ్డు ఎత్తును పెంచితే ఇళ్లు దిగువకు అవుతాయనే ఉద్దేశంతో గృహస్తులు చాలా ఎత్తులో ఇళ్లను నిర్మిస్తున్నారు.
- దీంతో వారి వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లాలంటే ర్యాంపులను నిర్మించుకోవాల్సిన పరిస్థితి. అయితే గేటు లోపలి వైపు ర్యాంపులను నిర్మించుకోవడానికి బదులు గేటు నుంచి రోడ్డుపైకి ర్యాంపులను నిర్మిస్తుండటంతో ఎత్తునుబట్టి ఒకోచోట రోడ్డు మధ్యవరకు ర్యాంపులు వస్తున్నాయి.
- దీనికి తోడు గ్రీనరీ పేరిట ప్రహరీ నుంచి 3, 4 ఫీట్ల మేర వెడల్పులో అడ్డుగోడలు నిర్మిస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోతోంది.
- రోడ్డుకు ఇరువైపులా గృహస్థులు ర్యాంపులు, గ్రీనరీ ఏర్పాటు చేసుకుంటుండటంతో 20 ఫీట్ల రోడ్డు కాస్తా 10 ఫీట్ల మేర మూసుకుపోతోంది.
- దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10 ఫీట్ల రోడ్డులో సైతం గృహస్తులు వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ఇక దారి నుంచి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు.
- ఈ విషయమై ఇళ్ల యజమానులు, వాహనదారులకు మధ్య నిత్యం గొడవలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి.

రోడ్డు లెవెలింగ్ తెలియనందునే...

పలు డివిజన్లలో చాలా కాలనీలు ఇపుడిపుడే అభివృద్ధి చెందుతున్నాయి. చాలా చోట్ల ఇంకా పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం జరుగలేదు. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు భవిష్యత్‌లో తమ ఇంటి ముందు రోడ్డును ఎంత ఎత్తులో నిర్మిస్తారో తెలియక ముందు జాగ్రత్తగా అవసరమైన దానికన్నా ఎత్తులో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇల్లు ఎత్తులో ఉండటంతో వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లడానికి వీలుగా ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నారు. అయితే పెద్ద ర్యాంపు నిర్మించాల్సివస్తే ఇంటి లోపలి నుంచి ర్యాంప్‌ను నిర్మించుకోవాలి తప్ప గేటు వద్ద నుంచి రోడ్డు పైకి నిర్మించవద్దని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

“ భారీ ర్యాంపులు నిర్మించొద్దు

కాలనీ రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి ర్యాంపులు, నిర్మాణాలు చేపట్టరాదని కాలనీ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించాం. రోడ్ల నిర్మాణం పూర్తయిన చోట ఇల్లు, అపార్ట్‌మెంట్, దుకాణాల ముందు ర్యాంపులు ఎట్టి పరిస్థితుల్లో 3 అడుగులకు మించరాదు. రోడ్డును ఆక్రమించి నిర్మించే ర్యాంపులను తొలగిస్తాం.

– ఎం.శేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, విశ్వేశ్వరాయ ఇంజినీర్స్ కాలనీ



హస్తినాపురం డివిజన్ ద్వారకామయినగర్‌లో రోడ్డుపైకి ర్యాంపు

పన్నుల భారాన్ని తగ్గించాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా



పన్నులపై ప్రచారం చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో అధిక పన్నుల భారాన్ని తగ్గించాల్సిందేనని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో ప్రజలపై అధిక పన్నుల భారం పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పన్నులను తగ్గించేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటేశ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు యాదిరెడ్డి, నాయకులు.. గంగమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్, సుభాష్‌రెడ్డి, కుమార్, మధు, ఐతరాజు భాస్కర్ పాల్గొన్నారు.

కల్వర్టు పనుల్లో జాప్యంపై కార్పొరేటర్ ఆగ్రహం



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: ఎంత కాలం పని చేస్తారు.. ఎప్పుడో పూర్తి చేయాల్సిన పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు.. ఎన్ని రోజులు ప్రజలు అవస్థలు పడాలి.. అంటూ అధికారులు, కాంట్రాక్టర్‌పై కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హయత్‌నగర్ డివిజన్‌లోని మునుగనూరు వెళ్లే దారిలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో శంకుస్థాపన చేసిన కల్వర్టు పనులు ప్రారంభించేందుకు ఆలస్యం చేశారని, పనులు మొదలు పెట్టి కూడా ఆలస్యంగా చేస్తున్నారన్నారు. కల్వర్టు నిర్మాణం ఆలస్యం అవుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేగంగా పనులు పూర్తి చేసి కల్వర్టును తొందరగా వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత



వైద్య సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.గీత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని గురువారం కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.గీత సందర్శించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి ఇటీవల ఇద్దరు వైద్యులు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిని సందర్శించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ.. డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైనసేవలు అందించాలని సూచించారు. అంతకుముందు కామారెడ్డి ప్రభుత్వాస్పత్రి సివిల్ సర్జన్ రవీంద్రమోహన్ సందర్శించి ప్రభుత్వాస్పత్రికి అవసరమైన వసతుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్, డాక్టర్లు మంజుల, మైమునాబేగం, జయశ్రీ తదితరులు ఉన్నారు.